యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, జూలై 26: జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిరుద్యోగయువతలో నైపుణ్యాలను పెంపొందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఉపాధి కల్పన, డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. పెద్దపరిశ్రమలు, వ్యాపార సంస్థలను సంప్రదించి, వారి అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇప్పించి, ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, మోటారుమెకానిక్, టైలరింగ్, ప్లంబర్, కార్పెంటర్, డేటా ఎనాలసిస్, అకౌంట్స్ తదితరాల్లో యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఖయ్యూమ్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాషా, ఎల్డీఎం రమణకుమార్, జిల్లా వ్యయసాయాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌పై ఉద్యోగుల ఆగ్రహం

ధర్మవరం మున్సిపల్ కార్యాలయం ముట్టడి


మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ధర్మవరం, జూలై 26: స్థానిక 26వ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న నాగరాజు సస్పెన్షన్‌పై ఉద్యోగులు ఆందోళనకు దిగారు. మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ శుక్రవారం ఉదయం సచివాలయ తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో శానిటేషన్ కార్యదర్శి లేరు. కాసేపటికి వచ్చారు. దీంతో ఆలస్యంగా వచ్చినందుకు శానిటేషన్ కార్యదర్శిని కమిషనర్ సస్పెండ్ చేశారు. శానిటేషన్ కార్యదర్శి ఉదయం 6 గంటలకు సచివాలయానికి చేరుకోవాల్సి ఉంది. 6.30 గంటలైనా రాలేదని కమిషనర్ పేర్కొంటున్నారు. శానిటేషన్ సెక్రటరీ సస్పెన్షన్‌పై సచివాలయ ఉద్యోగులు మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే బైఠాయించి, నినాదాలు చేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ.. శానిటేషన్ సెక్రటరీ నాగరాజు తొలుత మార్కెట్‌లోని కార్యాలయంలో మస్టర్‌లో సంతకం చేసి, అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని సచివాలయానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకు కనీసం 15 నిమిషాల సమయం పడుతుందన్నారు. అది కూడా ఆలోచించకుండా ఏదో వంక పెట్టుకుని ఐదు నిముషాలు ఆలస్యమైనందుకే ఉద్యోగిని సస్పెండ్ చేయడం తగదని సంఘం నాయకులు మండిపడ్డారు. కక్ష సాధింపులకు దిగడం సరికాదన్నారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సస్పెన్షన్ ఎత్తేసే ప్రసక్తే లేదని కమిషనర్ తెగేసి చెప్పారు. ఆందోళనలు ఉధృతం చేస్తామని ఉద్యోగులు పేర్కొని, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పోలీసులు ఆదర్శంగా ఉండాలి

క్రమశిక్షణ ప్రధానం.. జిల్లా ఎస్పీ రత్న


పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూలై 26: పోలీసు సిబ్బంది ఆదర్శంగా ఉండాలనీ, క్రమశిక్షణే అత్యంత ప్రధానమని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో ఏఆర్ సాయుధబలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులు నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పరేడ్.. పోలీసు క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. తద్వారా సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. నెలలో కనీసం రెండుసార్లు పరేడ్‌లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఆగస్టు 15 నాటికి మరింత మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంటాడుతున్న స్మార్ట్ భూతం!

గత వైసీపీ హయాంలో రైతు వ్యతిరేక నిర్ణయం


వ్యవసాయ బోరుకు అమర్చిన స్మార్ట్‌మీటరును తొలగిస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు (ఫైల్)


మీటరును ఈడ్చుకెళ్తున్న రైతులు (ఫైల్)

- వ్యవసాయ మోటార్లకు బలవంతంగా స్మార్ట్‌మీటర్లు
- అన్నదాతల తిరుగుబాటు
- రాత్రిళ్లు బిగించిన గత ప్రభుత్వం
- పాలకపక్షం మారినా అమర్చుతున్న కాంట్రాక్టర్


వ్యవసాయ మోటారుకు అమర్చిన స్మార్ట్‌మీటరు

కొత్తచెరువు, జూలై 26: తమది రైతు ప్రభుత్వం అంటూనే గత వైసీపీ పాలకులు వారికి నష్టం మిగిల్చేలా నిర్ణయాలు తీసుకున్నారు. రైతులను ఆదుకోవడం పక్కనబెట్టి వారిని ఇబ్బందులు పెట్టారు. రైతులు, రైతు సంఘాలు వద్దని మొత్తుకుంటున్నా.. వినకుండా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో మీటర్లు బిగించేందుకు వెళ్లగా.. రైతులు తిరుగుబాటు చేశారు. తమ పొలాల్లో ఏర్పాటు చేయవద్దని కరాఖండిగా చెప్పారు. దీంతో చాలాచోట్ల సిబ్బంది చేసేదిలేక వెనుదిరిగారు. కొన్నిచోట్ల రైతులు పొలాల్లో లేనపుడు బిగించి వెళ్లినా.. వాటిని తొలగించి పడేశారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే రైతు మెడకు ఉరితాడు బిగించడమేనని రైతు సంఘాలు మండిపడ్డాయి. అయినా.. గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. రాత్రిళ్లు బిగించారు. ఇటీవలి ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అయినా.. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను కాంట్రాక్టర్ కొనసాగిస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 63 మండలాల్లో 3.52 లక్షల వ్యవసాయ మోటార్లున్నాయి. వాటికి స్మార్ట్‌మీటర్లు బిగించాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2022 ఫిబ్రవరిలో జిల్లాలో మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కాంట్రాక్టర్లు ఇప్పటివరకు కదిరి డివిజన్‌లో 15,320, హిందూపురం 25,491, గుత్తి 11,734, అనంతపురం రూరల్ 6,26, అనంతపురం అర్బన్‌లో 6,230 మీటర్లను వ్యవసాయ మోటార్లకు అమర్చారు. ప్రస్తుతం కళ్యాణదుర్గం డివిజన్‌లో వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. వ్యవసాయ బావులకు మీటర్లు వద్దంటూ రైతులు, రైతుసంఘం నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. మోటార్లకు మీటర్లకు బదులు తమ మెడలకు ఉరితాళ్లు వేయాలంటూ రైతులు మండిపడుతున్నారు. కొత్తచెరువు మండలంలోని దంట్లపల్లిలో గతేడాది మోటార్లకు మీటర్లు అమర్చడాన్ని రైతులు మూకుమ్మడిగా అడ్డుకుని, వాటిని తొలగించి, ఆందోళన చేపట్టారు. దీంతో మోటార్లకు మీటర్ల ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది. స్మార్ట్‌మీటర్లు అమర్చిన రైతుల ఆధార్, ఫోన్, బ్యాంకు ఖాతా నెంబర్లు ఈపీడీసీఎల్ అధికారులు సేకరిస్తున్నారు. రైతుల బ్యాంకు ఖాతాలకు వినియోగించిన రీడింగ్ చార్జీల మొత్తాలు జమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆ మొత్తాన్ని మళ్లీ ప్రభుత్వానికి రైతులు చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ఎన్నికల ముందు నిలిపివేసిన వైసీపీ

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న తొలిరోజుల్లో రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. రైతుసంఘాల నాయకులు కూడా వైసీపీ సర్కారుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. దీంతో ఎన్నికలు సమీపిస్తుండున రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని మాజీ సీఎం జగన్ తాత్కాలికంగా వాయిదా వేశారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో స్మార్ట్‌మీటర్ల బెడద ఉండదని రైతులు భావించారు. కూటమి ప్రభుత్వం మీటర్ల ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయమై తీసుకోలేదు.

కొందరు కాంట్రాక్టర్లు అత్యుత్సాహంతో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై రైతు సంఘం నాయకులు.. ట్రాన్స్‌కో అధికారులను నిలదీస్తే.. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం పనులు సాగుతున్నాయని చెబుతున్నారు. వ్యవ సాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయబోమని ఎన్నికల ప్రచారంలో సాక్ష్యాత్తు టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయినా ట్రాన్స్‌కో అధికారులు మీటర్ల బిగింపు ప్రక్రియను కొనసాగిస్తుండడం ఏమిటని రైతు సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వెంటనే ఆపేయాలి

గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అంటూనే మోటార్లకు మీటర్లను అమర్చింది. 9 గంటల ఉచిత విద్యుత్‌ను 7 గంటలకే కుదించింది. కూటమి ప్రభుత్వమైనా 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి. స్మార్ట్‌మీటర్లు అమర్చే ప్రక్రియను వెంటనే నిలిపేయాలి.

\- వేమనారాయణ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఆపేయాలని ప్రభుత్వం నుంచిగానీ, ఉన్నతాధికారుల నుంచిగానీ ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నిలుపుదల చేస్తాం.

\-మోహనమ్మ,
కన్‌స్ట్రక్షన్స్ ఈఈ, ట్రాన్స్‌కో

బోర్లకు మీటర్లు వద్దు



అసలే కరువుకాటకాలతో కొట్టుమిట్టాడుతున్నాం. ఉచిత కరెంటును రద్దు చేయాలన్న ఉద్దేశంతో మాజీ సీఎం జగన్ వ్యవసాయ మోటార్లకు మీటర్లు అమర్చుతున్నారు. వాటిని కూటమి ప్రభుత్వం రద్దుచేసి, రైతులను ఆదుకోవాలి.

\-బాలకుల్లాయప్ప, రైతు, వేములేటిపల్లి

ఉచితమంటున్నారు.. బ్యాంకు ఖాతాలు అడుగుతున్నారు..



గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాన్స్‌కో అధికారులు.. రైతు బ్యాంకు ఖాతా, ఆధార్, సెల్‌నంబర్లు సేకరించారు. దీంతో రైతులు ఆందోళనకు లోనవుతున్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంటు ఇస్తామన్నపుడు మోటార్లకు స్మార్ట్‌మీటర్లు ఎందుకు? రైతుల నుంచి విద్యుత్ బిల్లులు కట్టించుకోవడానికి కాకపోతే.

\- సూర్యనారాయణరెడ్డి, రైతు, దంట్లపల్లి

అడ్డగోలు అధికారి..!

- పురం మున్సిపాలిటీలో వైసీపీ వీరవిధేయుడు
- మాట వినకపోతే జీతం కట్
- మహిళా ఉద్యోగికి వేధింపులు
- కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు

హిందూపురం, జూలై 26: ఆయన ఎక్కడ పనిచేసినా వివాదాస్పదమేనన్న విమర్శలు మూటగట్టుకున్నారు. గత వైసీపీ పాలనలో ఆయనను కొంతమంది అప్పటి నాయకులు ఇక్కడికి రప్పించుకున్నారు. ఆయన పార్టీకి వీరవిధేయుడిగా పనిచేస్తారనీ, అడ్డగోలుగా వ్యవహారాలు చేస్తారన్న నమ్మకమే ఇందుకు కారణం. అందుకు అనుగుణంగానే ఆయన స్వామిభక్తి ప్రదర్శిస్తూ వచ్చారు. వైసీపీ ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరినా ఆయన మాత్రం మారలేదు. తాను చెప్పిందే జరగాలని హుకుం జారీ చేస్తున్నారు. ఉద్యోగులు తిరగబడుతున్నారు. ప్రజల కోసం పనిచేస్తామే తప్ప.. అడ్డగోలు వ్యవహారాలకు సహకరించమని కరాఖండిగా చెబుతున్నారు. ఇది మింగుడు పడని సదరు అధికారి కార్యాలయంలో పనిచేసే కొంతమంది సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తూ.. వేధిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనపై మున్సిపాలిటీలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగిని ఏకంగా హోంమంత్రి, జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు లేఖ రాయడమే ఇందుకు నిదర్శనం. దీనినిబట్టి సదరు అధికారి ఏ స్థాయిలో వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుంది.

మాట వినకపోతే అంతే..

ఆయన మున్సిపాలిటీలోని ఓ విభాగంలో కీలక అధికారి. ఆయన మాట వినకపోతే జీతాలు నిలిపివేయిస్తారు. సదరు సిబ్బందిపై ఫిర్యాదు చేసి వేధించడం షరామామూలని మున్సిపాలిటీలో చెప్పుకుంటుంటారు. ఇటీవల కొంతమంది ఆయన మాట వినకపోవడంతో లేనిపోని ఆరోపణలతో ఉన్నతాధికారుకు ఫిర్యాదు చేయించడం, సమాచార చట్టంతో వేధించాడని అక్కడ పనిచేసే సిబ్బంది బహిరంగంగా చెప్పుకుంటుంటారు. ఆయనకు సంబంధం లేని విభాగంలో ఓ మహిళా ఉద్యోగి ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. మూడు నెలలక్రితం ఆమె అనారోగ్యం బారినపడి కొన్నిరోజులు సెలవు పెట్టారు. అనంతరం ఆమె విధులకు హాజరయ్యారు. అప్పటి నుంచి సదరు అధికారి వేధింపులు మొదలెట్టారు. తన విభాగంలో పనిచేయాలనీ, లేదంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని కాంట్రాక్టు ఉద్యోగిని బెదిరిస్తున్నారు. గతనెలకు సంబంధించి వేతనం కూడా నిలిపేశారు. మున్సిపాలిటీలోని ఇతర అధికారులకు సమస్య చెప్పుకుంటే.. వేధింపుల సారుకు విన్నవించుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. సదరు మహిళా కాంట్రాక్టు ఉద్యోగిని భర్త లేకపోవడంతో కార్యాలయంలో ఉన్నపుడు ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చేసేదిలేక ఆమె ఉన్నతాధికారులను ఆశ్రయించారు.

వైసీపీకి నమ్మినబంటు

సదరు అధికారి వైసీపీ నాయకులకు నమ్మినబంటు. వైసీపీ ఇన్‌చార్జి సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఆయన మాట మున్సిపాలిటీలో శాసనంగా మారింది. పైస్థాయి అధికారులున్నా ఆయన చెప్పిందే జరగాలి. లేదంటే మొన్నటివరకు వైసీపీ ఇన్‌చార్జికి వెళ్లి ఇతర అధికారులపై ఫిర్యాదులు చేసేవారు. దీంతో చేసేదిలేక మిగిలిన ఉద్యోగులు మిన్నకుండిపోయారు. కార్యాలయంలోని కొన్ని రహస్య సమావేశాలు, నిర్ణయాలను వైసీపీ నాయకులకు చేరవేసేవారని చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం మారడంతో ఆయన వ్యవహారాలు ఒక్కొక్కటే వెలుగుచూస్తున్నాయి. సదరు అధికారి సైతం కాంట్రాక్టు ఉద్యోగినిపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తనపై ఆరోపణలు చేస్తోందనీ, తద్వారా తన ప్రతిష్టకు భంగం కలుగుతోందనీ, ఆమెపై కోర్టుకు వెళ్తానని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏది ఏమైనా హిందూపురం మున్సిపాలిటీ పరువు రోడ్డుకెక్కేలా ఉంది.

పోలీసు స్టేషన్‌లో దొంగలు..!

సీజ్ చేసిన బైక్‌లు మాయం


కేసులో పట్టుబడిన వాహనం బయట ఉన్న దృశ్యం


కేసులో పట్టుబడినట్లు పోలీసులు ఇచ్చిన నోటీసు

- దర్జాగా బయట తిప్పుతున్న వైనం
- అప్పగించారా.. అపహరించారా.. అన్న అనుమానాలు
- వైసీపీ నాయకుల చేతికి వాహనాలు?

హిందూపురం, జూలై 26: ఇటీవల కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, ఆయా స్టేషన్లలో భద్రపరిచారు. ఆ తరువాత కోర్టు ద్వారా వాహనాలను యజమానులకు అప్పగిస్తారు. హిందూపురం నియోజకవర్గంలోని కొన్ని పోలీసు స్టేషన్లలో కేసుల్లో పట్టుబడిన వాహనాలను యజమానులకు కాకుండా కొన్నింటిని వైసీపీ నాయకులకు అప్పగించినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అప్పట్లో వైసీపీ నాయకులతో పోలీసులకు ఉన్న సాన్నిహిత్యమే ఇందుకు కారణమన్న వాదనలున్నాయి. పట్టుబడిన వాహనాల్లో కొన్నింటిని తమకు అనుకూలమైన వైసీపీ వర్గీయులకు అప్పగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎలా వెళ్లిందో..?

చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఈ ఏడాది మార్చి ఆఖరి వారంలో సింగిరెడ్డిపల్లికి చెందిన ఓ యువకుడు ఇంట్లో శుభకార్యం సందర్భంగా బాగేపల్లి నుంచి కర్ణాటక మద్యం తీసుకొస్తూ పట్టుబడ్డాడు. పోలీసులు.. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సదరు యువకుడిపై కేసు నమోదు చేశారు. ఆ ద్విచక్రవాహనం కోసం పలుమార్లు చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో సంప్రదించగా.. వాయిదాలు వేస్తూ వచ్చారు. ఆఖరికి జిల్లా ఎస్పీ వద్ద మొర పెట్టుకున్నారు. సదరు యువకుడు ద్విచక్రవాహనం కోసం ఈనెల 23న చిలమత్తూరు స్టేషన్‌కు బయల్దేరాడు. కోడూరుతోపు వద్ద తన ద్విచక్రవాహనం కంటపడింది. ఈ బైక్ తనదేనని ఆ యువకుడు ప్రశ్నించాడు. వాహనం నడుపుతున్న వ్యక్తి తనదేననీ, వేరేవారివద్ద కొనుగోలు చేశానని చెప్పుకొచ్చాడు. అనుమానం వచ్చి బైక్‌ను అడ్డగించాడు. బైక్ నడుపుతున్న వ్యక్తి ఓ పార్టీకి చెందిన కార్యకర్త అని తెలిసింది. ఆ సందర్భంలో తన బైక్‌ను వేరేవారు నడుపుతుండగా.. పట్టుకున్నానని పోలీసులకు తెలపగా.. వారు ఆ యువకుడిపై దురుసుగా ప్రవర్తించారు. ఈ స్టేషన్‌లో ఈ ఒక్క వాహనం మాత్రమే కాదు, పలుచోట్ల ఇలానే చేసినట్లు ఆ శాఖలో పనిచేసేవారు చెప్పుకుంటున్నారు. ఈ వాహనాన్ని పోలీసులే విక్రయించారా, వారికున్న సాన్నిహిత్యంతో అలా అంటున్నారా, స్టేషన్‌లోంచి ఎవరైనా అపహరించారా అనేది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది. ఈ స్టేషన్‌లో చాలారోజుల క్రితం పట్టుబడిన కొన్ని బైక్‌ల యజమానులు రాకపోవడంతో వాటిని పోలీసులే ఎంతోకొంత జరిమానా విధించినట్లు స్లిప్పులు సృష్టించి, విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. హిందూపురం నియోజకవర్గంలోని మరో మండల పోలీసు స్టేషన్‌లో కొన్ని ద్విచక్రవాహనాలు కర్ణాటకకు చెందిన వ్యక్తులకు విక్రయించినట్లు కొన్ని నెలల క్రితం ఆరోపణలు వచ్చాయి. హిందూపురానికి సంబంధించిన ఓ పోలీసు స్టేషన్‌లో కొన్నిరోజుల క్రితం కర్ణాటకకు చెందిన వ్యక్తులు ద్విచక్రవాహనాలపై మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. వారు మద్యం, ద్విచక్రవాహనాన్ని వదిలి పారిపోయారు. వారు కొన్ని రోజులపాటు రాకపోవడంతో ఇక రారని సీఐ వద్ద కీలకంగా వ్యవహరించే కానిస్టేబుల్ ఓ వాహనాన్ని బంధువులకు అప్పగించి, మరో దానిని విక్రయించినట్లు తెలిసింది.

దర్జాగా తిప్పుతున్న వైనం

కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలు స్టేషన్‌లో కాకుండా బయట వ్యక్తుల వద్ద ఉన్నట్లు సమాచారం. పట్టుబడిన వాహనాల్లో కండీషన్ బాగున్న వాటిని పోలీసులు బయటికి విక్రయించారా, వేరేవిధంగా జరిగిందా అన్నది పక్కనపెడితే వాటిని తీసుకెళ్లిన వ్యక్తులు కనీసం నంబర్‌ప్లేటు కూడా మార్చకుండా దర్జాగా తిప్పుతున్నారు. అలా తిప్పుతున్నారంటే పోలీసులు ఇచ్చిన ధైర్యమా, డబ్బుపెట్టి కొనుగోలు చేశామన్న ధీమానా? అన్నది వారికే తెలియాలి.

బయట వ్యక్తులు తిప్పుతుంటే కఠిన చర్యలు

కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలు కోర్టు ద్వారా వాహన యజమానులు తీసుకునే ఆస్కారం ఉంది. అలాకాకుండా పోలీసులే బయటకు ఇచ్చేసినా, మరోవిధంగా బయటి వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవు. దీనిపై లోతుగా విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

\-కంజక్షన్,
డీఎస్పీ, హిందూపురం

తొలుత తాగునీటికే..

తర్వాతే ఆయకట్టుకు..: హెచ్చెల్సీ ఎస్ఈ

కణేకల్లు, జూలై 26: తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న నీటిలో మొదటి ప్రాధాన్యం తాగునీటికే ఇస్తున్నామని తర్వాత సాగునీటిని ఆయకట్టుకు విడుదల చేస్తామని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం హెచ్చెల్సీ కెనాల్ 189 కి.మీ. నుంచి 105 కి.మీ. వరకు ఆయన హెచ్ఎల్‌సీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక కణేకల్లులో వారు విలేకరులతో మాట్లాడారు. ఆంధ్ర సరిహద్దులో వస్తున్న 750 క్యూసెక్కుల నీటిని కణేకల్లు చెరువు ద్వారా దిగువ వైపున ఉన్న తాగునీటి పథకాలకు విడుదల చేస్తున్నామన్నారు. కణేకల్లు చెరువు నుంచి వంద క్యూసెక్కుల నీరు బయటకు వెళుతున్నాయని పదిరోజుల పాటు వచ్చిన నీటిని జిల్లాలోని తాగునీటి సమ్మర్ స్టోరేజీల్లో నిల్వ చేయడం జరుగుతుందన్నారు. ఆగస్టు 2వ వారం తర్వాత ఐఏబీ సమావేశం నిర్వహించి ఆయకట్టు భూములకు ఎప్పుడు నీరు విడుదల చేయాలో నిర్ణయిస్తావనారు. కెనాల్ ప్రస్తుత పరిస్థితి అన్ని చోట్ల పటిష్ఠంగా ఉందని 1800 క్యూసెక్కుల మేర నీరు కాలువలో ప్రవహించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. అవసరాన్ని బట్టి ప్రతిరోజూ నీటి ఇండెంట్‌ను పెంచుకుని హెచ్చెల్సీలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూస్తామని వివరించారు. సమావేశంలో ఈఈ వెంకటరమణారెడ్డి, డీఈ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ

బొమ్మనహాళ్: ఆంధ్ర సరిహద్దులోని 104/787 కి.మీ. వద్ద హెచ్చెల్సీ కాలువను శుక్రవారం సాయంత్రం ఈఈ రమణారెడ్డితో ఎస్ఈ రాజశేఖర్ పరిశీలించారు. నీటిమట్టాన్ని పరిశీలించి ఇన్‌ఫ్లో వస్తున్న జలాలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు రిజిష్టర్ నమోదుచేయాలని ఆదేశించారు. సరిహద్దులో హెచ్చుతగ్గులు లేకుండా నీటిని ఇవ్వాలని, ఈ నెల ఆఖరి వరకు ఇండెంట్ ఎక్కువస్థాయిలో పెంచకుండా ఇవ్వాలని కర్ణాటక సెక్షన్ ఆఫీసర్ భక్తవత్సలతో అన్నారు. నీటిపారుదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం ఒకటవ డిస్ట్రిబ్యూటర్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఈ మద్దిలేటి, ఏఈ అల్తాఫ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, నవీన్, ధనుంజయ, పయ్యావుల మోహన్ పాల్గొన్నారు.

మూడు రోజుల్లో హంద్రీనీవా కాలువకు నీరు

కేఆర్ఎంబీకి లేఖ రాసిన అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26: రెండు, మూడు రోజుల్లో హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. జలవనరుల శాఖ జిల్లా సీఈ నాగరాజు, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్.. కృష్ణా యాజమాన్య బోర్డుకు అనుమతి కోసం లేఖ రాశారు. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 859 అడుగుల మేర 105 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 880 అడుగులు వచ్చే సమయానికి మల్యాల నుంచి రెండు పంపుల ద్వారా కృష్ణా జలాలను హంద్రీనీవాకు విడుదల చేయడానికి అనుమతి కోరారు. శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో 2.20 లక్షలు వస్తోంది. మొదట మల్యాల నుంచి 1000 క్యూసెక్కుల ప్రకారం హంద్రీనీవా కాలువకు నీరు వదలనున్నారు. ఐదు రోజుల తర్వాత జిల్లా సరిహద్దుల్లోకి నీరు ప్రవేశిస్తుంది. ఈ ఏడాది హంద్రీనీవాకు పూర్తిస్థాయి కేటాయింపులు 40 టీఎంసీలు వచ్చే అవకాశం ఉంది.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి

వైసీపీ సర్పంచ్‌పై జేసీ, తహసీల్దార్లకు డాక్టర్ ఫిర్యాదు

బుక్కరాయసముద్రం, జూలై 26: మండలంలోని గోవిందంపల్లి గ్రామంలో భూమి హక్కు లేకపోయిన రోడ్డు స్థలాన్ని రేగడికొత్తూరు గ్రామ సర్పంచ్ తిరుమల రెడ్డి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని అనంతపురం మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న శివశంకర్‌మూర్తి, మరో ఇద్దరు రైతులు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతపురం ఇన్‌చార్జి జేసీ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ హనుమంతునాయక్, సీఐ వెంకటేశ్వర్లుకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గోవిందంపల్లి గ్రామంలో సర్వేనెంబర్‌లో 135-1ఏలో గ్రామానికి ఉన్న ప్రధాన రహదారికి వెళ్లిన 96 సెంట్ల స్థలాన్ని ఈ నెల 12న ఆన్‌లైన్‌లోకి తిరుమలరెడ్డి అక్రమంగా ఎక్కించాడని, 14న భద్రంపల్లి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని పేర్కొన్నాడు. రోడ్డుకు వెళ్లిన స్థలాన్ని ఆన్‌లైన్‌లో ఎలా ఎక్కిస్తారని ప్రశ్నించాడు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి ఆన్‌లైన్ 1బీ అడంగల్‌లో తొలిగించాలని జేసీ, తహసీల్దార్ ఆయన కోరారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని తమ భూమిలోసైతం తనకు హక్కు ఉందని డబ్బులు డిమాండ్ చేసేందుకు యత్నిస్తున్నాడని సీఐకి ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి



బోయ రాముడు (ఫైల్)

రాయదుర్గంరూరల్, జూలై 26: పొలంలో పనిచేస్తుండగా విద్యుదాఘాతంతో కౌలురైతు బోయ రాముడు(40) శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని ఆర్‌బీవంక గ్రామానికి చెందిన రాముడు అదే ఊరికి చెందిన ఒక రైతుకు సంబంధించిన ఎకరాన్నర పొలాన్ని కౌలుకు తీసుకొని, వరి పంట సాగు చేశాడు. శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా కావడంతో మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లాడు. అప్పటికే స్టార్టర్ పెట్టెకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో షాక్ తగిలింది. స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూలై 26: విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని ఆ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. సీనియర్ కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మట్టి తంబూర', 'మాకూ ఒక నది కావాలి' కవితా సంపుటాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

కీలక పోస్టుల కోసం క్యూ..

సీఈఓ, డీపీఓ పోస్టులకు యత్నాలు



జడ్పీ కార్యాలయం

అనంతపురం విద్య, జూలై 26: జిల్లాలోని కీలక పోస్టులకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీనియర్ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(డీఎల్‌డీఓలు) ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులతోపాటు, తాము చేయాలనుకుంటున్న పలు కీలక పోస్టులకు కొందరు ప్రయత్నాలు సాగిస్తున్నట్టు అటు జిల్లాపరిషత్, ఇటు మండల పరిషత్ కార్యాలయాల్లో తీవ్రస్థాయిలో చర్చ సాగుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్ సీఈఓ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ సీఈఓగా పనిచేస్తున్న వైఖోమ్ నిదియాదేవి రాజంపేటకు బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సదరు పోస్టుకు డీఎల్‌డీఓ ఓబులమ్మ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఆమె ప్రస్తుతం అనంతపురం డీఎల్‌డీఓగా పనిచేస్తున్నారు. ఇటీవల డీఆర్‌డీఏ పోస్టు ఖాళీ పడటంతో ఓబుళమ్మకు డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల కలెక్టర్ ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసింది. ఆమె క్లియర్ వెకెన్సీ ఉన్న జడ్పీ సీఈఓ పోస్టుకు యత్నాలు చేస్తున్నట్టు ఆ శాఖ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కదిరి డీఎల్‌డీఓగా పనిచేస్తున్న సూర్యనారాయణ, డ్వామాలో ఏపీడీగా పనిచేస్తున్న డీఎల్‌డీఓ సుధాకర్‌రెడ్డి సైతం జిల్లా పంచాయతీ ఆఫీసర్ (డీపీఓ) పోస్టుకు ట్రై చేస్తున్నట్టు సమాచారం. జడ్పీ సీఈఓ పోస్టు ఖాళీ పడటంతో డీపీఓ ప్రభాకర్‌రావుకే ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీపీఓ ప్రభాకర్‌రావు సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ప్రభాకర్‌రావుది మరో జిల్లా కావడంతో ఇక్కడే పనిచేస్తున్న డీఎల్‌డీఓలు ఆ పోస్టును ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు డీఎల్‌డీఓలు ఆ పోస్టుకు యత్నాలు చేస్తున్నట్టు ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. గతంలో జడ్పీ డిప్యూటీ సీఈఓగా, కొంతకాలం సీఈఓగా పనిచేసిన అనుభవం ఉన్న శ్రీనివాసులు టూరిజం శాఖలో రీజనల్ స్థాయి పోస్టుకు యత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా పనిచేస్తున్న ఓబుళమ్మకు ఇటు జడ్పీ సీఈఓ పోస్టు కాకుండా, డీఆర్‌డీఏ రెగ్యులర్ పీడీగా ఉత్తర్వులు వస్తే శ్రీనివాసులుకు జడ్పీ సీఈఓగా ఉత్తర్వులు అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ టాక్ నడుస్తోంది. అటు సూర్యనారాయణ, ఇటు సుధాకర్‌రెడ్డిలో ఎవరో ఒకరికి డీపీఓగా ఉత్తర్వులు వస్తే వారిలో కూడా ఒకరు సీఈఓ పోస్టుకు పోటీపడే అవకాశం ఉన్నట్టు స్పష్టమవుతోంది. సీఈఓ, డీపీఓ పోస్టులకు మాత్రం జిల్లాలో పనిచేసే డీఎల్‌డీఓల్లో సీనియర్లు బాగానే ట్రై చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రాజధాని బాట పట్టి ఆయా శాఖలు, తమకు తెలిసిన మంత్రులు, ఇతర ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు ఆయా శాఖ వర్గాల నుంచి తెలుస్తోంది.

అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

కేబుల్ బాక్సుల మాటున రవాణా
పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు..
మరో ఇద్దరి కోసం గాలింపు
ఎస్పీ మురళీకృష్ణ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

రాయదుర్గంటౌన్, జూలై 26: పట్టణంలోని శివారుప్రాంతమైన ఉడేగోళం వద్ద అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. వచ్చిన సమాచారం మేరకు సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో డీటీఎఫ్ సీఐ వెంకటలక్ష్మి, ఇంటలిజెన్స్ సీఐ కృష్ణ, రాయదుర్గం సెబ్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో రాయదుర్గం మండలం ఉడేగోళం వద్ద హైవేపై వాహనాలు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఐచర్ వాహనంలో గోవా నుంచి ఫినోలెక్స్ కేబుల్ బాక్సులను ఉంచి మధ్యలో 147 బాక్సుల గోవా మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అక్రమ మద్యాన్ని జిల్లాలోని యల్లనూరు మండలం కూచివారిపల్లికి తరలించి అధిక ధరలకు విక్రయించేందుకు నిందితులు సిద్ధమైనట్లు విచారణలో తేలిందన్నారు. గోవా నుంచి తెలంగాణాలోని నాచారంకు ఫినోలెక్స్ కేబుల్ బాక్సులను తీసుకెళ్లాల్సి ఉండగా అక్రమంగా గోవా మద్యాన్ని బాక్సుల మధ్యలో ఉంచి జిల్లాలోకి తరలించేందుకు ప్రణాళిక రచించినట్లు తెలిపారు. రూ. 4.52 లక్షలు విలువ చేసే గోవా మద్యం, 7496 కిలోల ఫినోలెక్స్ కేబుల్ బాక్సులు, ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వివిధ బ్రాండ్లకు చెందిన 147 బాక్సులు, 1294 లీటర్లు గోవా మద్యం మొత్తం విలువ రూ. 80 లక్షలు ఉంటుందని తెలిపారు. అక్రమ మద్యం తరలిస్తున్న నిందితులు అనంతపురం ఎన్‌టీఆర్ కాలనీ టీవీ టవర్‌కు చెందిన గొర్తి వంశీకృష్ణ, వజ్రకరూరు మండలం ధర్మపురి గ్రామానికి చెందిన అంకెల త్రినాథ్‌రెడ్డిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉండగా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం గుట్టురట్టు చేసిన పోలీసు సిబ్బందికి పారితోషికం అందజేశారు.

దామాషా పద్ధతిలో డివిజన్‌కు నిధులు

దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



నూతన కంట్రోల్ రూం భవనాన్ని ప్రారంభిస్తున్న రైల్వే జీఎం

గుంతకల్లు, జూలై 26: కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయించిన నిధులకు సంబంధించి ఏపీకి 9,130 కోట్లు వచ్చాయని, గుంతకల్లు రైల్వే డివిజన్‌కు అందులో నుంచి దామాషా పద్ధతిలో నిధులు వస్తాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన గుంతకల్లులో పర్యటించారు. ఉదయం రైల్వే డివిజనల్ కేంద్రమైన గుంతకల్లుకు వచ్చిన ఆయన డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిర్మించిన అత్యాధునిక రైల్వే కంట్రోల్ రూం భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి గణనీయమైన నిధులు వచ్చాయని, అందులో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు ఎంత వచ్చిందీ త్వరలో తెలుస్తుందన్నారు. బడ్జెట్ ద్వారా ఏ రైళ్లు వస్తాయో ఇంకా తెలియదని, ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడుపుతామన్నారు. బడ్జెట్ కేటాయింపులపై పూర్తి వివరాలు పింక్ బుక్ విడుదలైన తర్వాత తెలుస్తాయన్నారు. అనంతరం గుంతకల్లు రైల్వే జంక్షన్‌ను పరిశీలించి తిరుగు ప్రయాణమయ్యారు. కార్యక్రమంలో డీఆర్ఎం విజయకుమార్, ఏడీఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.



ధ్వంసమైన పైపులను చూపుతున్న రైతు మల్లేశప్ప



విచారిస్తున్న పోలీసులు

డ్రిప్ పైపులు ధ్వంసం

ముక్కలుగా నరికిన దుండగులు
రూ.8లక్షలకుపైగా నష్టం
లబోదిబోమంటున్న కౌలు రైతులు

విడపనకల్లు, జూలై 26: మండల కేంద్రంలోని కౌలు రైతులు మల్లేశప్ప, పార్వతి పొలంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డ్రిప్ పైపులను ధ్వంసం చేశారు. ఎకరం రూ. 40వేలతో కౌలుకు తీసుకుని 16 ఎకరాల్లో మిరప కంది పంటలను వారు సాగు చేశారు. వారం రోజుల క్రితం మిరప విత్తనం సాగు చేసి వాటికి నీరు అందించేందుకు దాదాపుగా 170 డ్రిప్ పైపులను ఏర్పాటు చేశారు. మిరప విత్తనానికి నీటి తడులు ఇవ్వటంతో మిరప నారు మొలకెత్తింది. గురువారం గ్రామంలో చిన్నపీర్ల సందడి ఉండటంతో వారు పొలం వైపు వెళ్లలేదు. శుక్రవారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు వారు వెళ్లి అక్కడ పరిస్థితిని చూసి ఆందోళనకు గురయ్యారు. 170 డ్రిప్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. డ్రిప్ వేసిన సాలు సాలుకు ఓ తుంటలా నరికేశారు. కొన్ని పైపులను పూర్తిగా ఛిద్రం చేశారు. మిరప నారుకు వారం రోజుల్లో నీటితడులు ఇవ్వాలని, లేకపోతే పంట ఎండిపోతుందని వారు వాపోయారు. ప్రస్తుత పైపులను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు మరో వారం రోజులుపడుతుందన్నారు. రూ. 8 లక్షల వరకు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుసేన్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కత్తెరపురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి

జిల్లాఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్

పుట్టపర్తిరూరల్, జూలై 26: ఉమ్మడి జిల్లాలో సాగుచేసిన మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు ఆశిస్తోందని, నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లాఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్ జిల్లా రైతాంగానికి ఒక ప్రకటనలో సూచించారు. ఈ సందర్భంగా ఆయన రైతాంగానికి పలు సూచనలుచేశారు. మొక్కజొన్న ప్రస్తుతం 20 రోజుల నుంచి 30 రోజుల దశలో ఉందని, ఈ మొదటిదశలో గొంగళిపురుగులు ఆకులపై పత్రహరితాన్ని గోకితింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుందన్నారు. గొంగళిపురుగులు పెరిగేకొద్ది ఆకుల చివరల నుంచి తింటూ ఆకులను కత్తిరించినట్లు తినేయడం గమనించవచ్చన్నారు. గొంగళిపురుగుల (కత్తెర పురుగులు)ను నివారించడానికి ఎకరానికి 4 నుంచి 5 లింగార్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. పంటపొలాన్ని గమనించి పురుగుల గుడ్ల సముదాయాలను గుర్తించి ఏరినాశనం చేయాలన్నారు. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒకలీటర్ వేప నూనె పిచికారి చేయాలన్నారు. తొలిదశలో గొంగళి పురుగులను నివారంచడానికి ఎకరానికి 500మిల్లీలీటర్ల క్లోరిఫైరిఫాస్ మందు లేదా 400మిల్లీమీటర్ల క్వినాల్‌ఫాస్‌ను పిచికారి చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును 80 గ్రాములు లేదా స్పైనోసాడ్‌ను 60 మిల్లీ లీటర్లు ఎకరానికి సుడులలోపు ఆకులు తడిసే విధంగా పిచికారి చేసుకోవాలన్నారు. ఈ మందులను అవసరాన్ని బట్టి రెండు మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. ఎదిగిన గొంగళి పురుగు నివారణకు 10కిలోల తవుడు, 2 కిలోల బెల్లం 2 లీటర్ల నీటిలో కలిపి 24 గంటలపాటు పులియబెట్టి ఆ మిశ్రమాన్ని 100 గ్రాముల తయోకార్బ్ మందును జోడించి సాయంత్రం సుడుల లోపు వేయాలని సూచించారు.

కిలో టమోటా రూ.25

అనంతపురంరూరల్, జూలై 26: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయాయి. ప్రస్తుతం మార్కెట్‌కు టమోటా ఉత్పత్తులు కొంతవరకు పెరిగాయి. 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.14 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18 వేలు



అనంతపురంరూరల్, జూలై 26: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1188 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అంతపురం సెంట్రల్, జూలై 26: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్23) ఫలితాలను శుక్రవారం ప్రొఫెసర్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ విడుదల చేశారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీఈ లలితకుమారి, విభాగాధిపతులు భారతి, కళ్యాణిరాధ, మమత, అజిత, భువనవిజయ, రామశేఖర్‌రెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

అంతపురం సెంట్రల్, జూలై 26: పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టామని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 45సీట్లకు సంబంధించి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి 31న అడ్మిషన్లు ఇస్తామన్నారు.

తిరుపతి ప్యాసింజర్ పాక్షిక రద్దు కొనసాగింపు

గుంతకల్లు, జూలై 26: రైల్వే డివిజన్‌లో జరుగుతున్న యార్డు వర్కుల కారణంగా తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి మధ్య నడిచే ప్యాసింజరు (నెం.07589/90) రైలు పాక్షిక రద్దును మరో నెలపాటు కొనసాగించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరును ఆగస్టు 1 నుంచి 31వ తేదీదాకా, దాని తిరుగు ప్రయాణపు రైలును ఆగస్టు 2 నుంచి సెప్టెంబరు 1వ వరకు కదిరిదేవరపల్లి-గుంతకల్లు మధ్య పాక్షికంగా రద్దుచేసి కేవలం గుంతకల్లు-తిరుపతి మధ్యన మాత్రమే నడుపుతామన్నారు. ప్రయాణికులు విషయాన్ని గమనించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు.

విధుల నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

గార్లదిన్నె, జూలై 26: విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఉపాధ్యాయుడిని విధుల నుంచి ఉన్నతాధికారులు తొలగించారు. మండల కేంద్రమైన గార్లదిన్నె మైనార్టీ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు సుధాకర్ ఆ పాఠశాల విద్యార్థులతో తన ద్విచక్ర వాహనాన్ని కడిగిస్తున్నాడు. విద్యార్థుల తల్లిదండ్రులు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు అతడిని విధుల నుంచి తొలగించినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె, జూలై 26: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హాస్టల్ నిర్వాహకుడి కుమారుడిపై పోలీసులు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ వేధింపులు, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మర్తాడుకు చెందిన పాస్టర్ సయ్యద్ వలి గార్లదిన్నె రైల్వేగేట్ సమీపంలో మిస్‌ప్రోగ్రెస్ హోప్ (క్రిస్టియన్) బాలికల హాస్టల్‌ను అనధికారికంగా నిర్వహిస్తున్నాడు. హాస్టల్‌లో ఉరవకొండ, బుక్కరాయసముద్రం, రాప్తాడు, విడపనకల్లు మండలాల నుంచి వివిధ గ్రామాలకు చెందిన సుమారు 10 మంది బాలికలు ఉంటున్నారు. పాస్టర్ సయ్యద్ వలి కుమారుడు నూర్‌బాషా తమపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు.. తల్లితండ్రులకు తెలియజేశారు. వారు హాస్టల్ వద్దకు చేరుకుని బాలికలతో మాట్లాడి నిర్వాహకుడితో గొడవకు దిగారు. నూర్‌బాషాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం నూర్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ వెంకటశివారెడ్డి విచారించి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



బొడ్రాతమ్మకు బోనాలు

నంబులపూలకుంట, జూలై 26: మండలకేంద్రానికి సమీపంలో దిగువపల్లిలో శుక్రవారం బొడ్రాతమ్మకు బోనాలు సమర్పించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి తప్పెట్లతో ఊరేగింపుగా నడిబొడ్డులో ఉన్న అమ్మవారికి బోనాలు తీసుకొచ్చారు. వేపాకు, పసుపుకుంకుమతో అలంకరించిన 101 బిందెలతో అమ్మవారికి గంగస్నానం చేయించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సకాలంలో కురవాలని ప్రార్థించారు.

చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు



ధర్మవరం, జూలై 26: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆషాఢ మాసం శుక్రవారాన్ని పురష్కరించుకొని... చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, బానుప్రకాశ్ స్వామివారికి తులసి ఆకులు, వివిధ రకాలు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



శివపార్వతులకు ప్రత్యేక పూజలు

ముదిగుబ్బ, జూలై 26: స్థానిక శివ పంచాయతన దేవాలయంలో శుక్రవారం ఆషాఢ మాసం సందర్భంగా శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖిల గాండ్ల సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు మనోహర శాస్త్రి స్వామీ అమ్మవార్లను కూరగాయలతో అలంకరించారు. వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు.

టీసీ ఇవ్వలేదని డీఈఓకు ఫిర్యాదు

కొత్తచెరువు, జూలై 26 : అమడగూరు మండలం సీకురేవ్వపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ తన కుమార్తె హరిప్రియకు టీసీ ఇవ్వలేదని డీఈఓ మీనాక్షికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. సుధాకర్ మాట్లాడుతూ.... హరిప్రియ అమడగూరు మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదివిందని, తన ఆర్థిక సమస్యలతో తన కుమార్తెను మూడో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అందుకు టీసీ ఇవ్వాలని ఆ ప్రైవేట్ పాఠశాల వారిని కోరాగా.. రూ. 10 వేలు డిమాండ్ చేస్తున్నారని వాపోయాడు. తాను ఫీజ్ మొత్తం చెల్లించానని, అయినా రూ.10 వేలు ఇవ్వాల్సిందేనని కోరుతున్నారన్నారు. విషయాన్ని స్థానిక ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దీంతో డీఈఓకు వినతిపత్రం అందించానని తెలిపాడు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

ధర్మవరం రూరల్, జూలై 26 : వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది, ఆముదం, రాగి, పప్పు దినుసులు సాగుచేసుకుని అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా తెలిపారు. శుక్రవారం మండలంలోని తుమ్మల గ్రామంలో రైతుసేవ కేంద్ర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటసాగులోని మెళకువలు, మేలైన సాగుపద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, భూసార పరీక్షలు, సమతుల్యమైన ఎరువుల వాడకం, నానో యూరియా వాడకం, డ్రోన్‌ల ద్వారా సస్యరక్షణ మందులు పిచికారిపై తదితర వాటిని వివరించారు. అనంతరం ఆయన కంది పొలాల్లోకి వెళ్లి రైతులతో కలిసి పరిశీలించారు. కంది అధిక దిగుబడులు సాధించడానికి ఎకరాకు 12 వేల మొక్కలను సాంద్రత ఉండాలని, సాలు, సాలుకూ మధ్య ఆరు అడగులు, ఒక సాలులో మొక్కల మధ్య ఒక అడుగు దూరం ఉండాలని సూచించారు. ముఖ్యంగా కందిలో రసం పీల్చే పురుగుల నివారణకు ఎకరాకు ఒక లీటర్ వేపనూనె పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య, రైతు వనరుల కేంద్రం ఏఓ అబ్దుల్ అలీ, మండల ఏఓ ముస్తాఫా, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు పరిశీలన

తనకల్లు, జూలై 26: మండలానికి కావలసిన ఇసుక సరఫరా కోసం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మండలంలోని పలు ప్రాంతాలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. భూగర్భ జలశాఖ వాణిశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కవిత, మైనర్ ఇరిగేషన్ అధికారి బయప్ప, గ్రామ రెవెన్యూ అధికారులు మండలంలోని నాయనచెరువుపల్లి వద్ద పరిశీలించారు. మీటర్ కట్టే తక్కువ ఇసుక డిపాజిట్ ఉందని, అక్కడ రీచ్ ఏర్పాటు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. తవళం వద్ద పరిశీలించిన అధికారులు అక్కడ కూడా రీచ్ ఏర్పాటుకు వీలుకాదన్నారు. రైల్వే, రహదారి బ్రిడ్జిల వద్ద ఇసుక డిపాజిట్ ఉన్నప్పటికి జాతీయ రహదారి, రైల్వే బ్రిడ్జిలు ఉండడంతో ఇసుక తరలించడం సరికాదని నిర్ధారించారు. టి. సదుం గ్రామం వద్ద ఇసుక తరలించడానికి వీలుగా ఉందని నిర్ధారించి, అధికారులకు నివేదికలు పంపున్నట్లు చెప్పారు. వారితోపాటు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్ ఒక్కరోజేనా..!



సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు

బుక్కపట్నం : స్థానిక సచివాలయం- 2లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క పంచాయతీలో మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. చాలామంది ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాల్సిఉంది. అయితేవారికి సమాచారం లేక సచివాలయానికి రాలేదు. ఈ కార్యక్రమాన్ని కనీసం నాలుగు రోజులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉండటం.. సచివాలయంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో చాలా సమయం నిరీక్షించాల్సి వస్తోందన్నారు.

కదిరి, (అమడగూరు): అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్ అప్‌డేట్ సేవలను స్పెషాలాఫీర్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో పేర్లు, చిరునామాలు మార్చుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ జిలాన్‌బాషా, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కొత్తచెరువు: ప్రభుత్వం కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో శిశుఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కళావతి తెలిపారు. శిశుఆధార్‌ను కామన్ సర్వీసు సెంటర్‌లో కానీ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆధార్ నమోదును తల్లిదండ్రులు చేయించుకోవాలన్నారు. శనివారం వరకు కొత్తచెరువు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా ఆధార్ నమోదు ఈ సర్వీసు సెంటర్ అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 95338 77556 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ధర్మవరం రూరల్, జూలై 26 : మండలంలోని పోతులనాగేపల్లి వీఆర్‌ఏ ఎట్టి ఓబన్న (59) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారజామున మరణించాడు. డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, వీఆర్‌ఓ భాస్కర్ ఆ గ్రామానికి వెళ్లి ఓబన్న మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మట్టిఖర్చుల నిమిత్తం రూ.25వేలను ఓబన్న భార్య పెద్దక్క, కుమారుడు రమేష్‌కు అందించారు. తోటి వీఆర్‌ఏల సంఘం నాయకులు రామకృష్ణ, మారెప్ప తదితరులు ఓబన్న మృతదేహానికి నివాళులర్పించారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

ధర్మవరం, జూలై 26: మండలంలోని తుమ్మల గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను బీజేపీ నాయకులు హరీశ్, మల్లికార్జున శుక్రవారం పరిశీలించారు. అనంతరం తుమ్మల గ్రామంలో డ్రైనేజీలను పరిశీలించారు. కాలువలు చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వస్తోందని, అపరిశుభ్రతతో దోమలు అధికమై తాము రోగాలు బారిన పడుతున్నామని గ్రామస్థులు బీజేపీ నాయకుల వద్ద వాపోయారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాకే ఓబుళేశు, గిర్రాజు నగేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నల్లమాడ, జూలై 26: స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ రమేష్ బాబు పలు విషయాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, డ్రగ్స్, ర్యాగింగ్, బ్యాడ్‌టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.

క్రికెట్ టోర్నీ విజేత కొత్తపేట

ధర్మవరం, జూలై 26 : స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో నాలుగు రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల జట్టు విజయం సాధించినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, పీడీ పద్మబాయ్ తెలిపారు. ఆ క్రీడాకారులకు నగదు బహుమతి అందజేసినట్లు తెలిపారు. కబడ్డీ పోటీల్లోనూ తమ పాఠశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారన్నారు. ఆ విద్యార్థులను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు గోరకాటి పెద్దారెడ్డి పాల్గొన్నారు.



ట్రోఫీతో విజేత జట్టు



కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు



ముదిగుబ్బలో మాజీ సైనికుడికి సన్మానం

కార్గిల్ అమరవీరులకు నివాళి



లోచర్లలో వంద మీటర్ల జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ

కదిరిఅర్బన్, జూలై 26: కార్గిల్ యుద్ధంలో అమలైన సైనికులకు స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల శుక్రవారం పలువురు నివాళులర్పించారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పట్టణంలోని ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించు కోవాలన్నారు. ఓబులేసు డిఫెన్స్ ఆకాడమి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్‌దివస్ నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి అమవీరులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హైదర్‌వలీ, శంకర్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి చెన్నారెడ్డి, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

● **ధర్మవరం:** కార్గిల్‌లో దేశం కోసం వీరమరణం పొందిన సైనికుల త్యాగాలను మరు వరాదని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివాస్ ర్యాలీని ఎన్‌సీసీ వలంటీర్లు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి పావని, కళాశాల అధ్యాపకులు షమీవుల్లా, కిరణ్ కుమార్, భువనేశ్వరి, వెంకట లక్ష్మీ, పుష్పవతి, తాహీర్, మీనా, ఆనంద్, గంగా పాల్గొన్నారు.

● **తనకల్లు:** టీమ్ భగత్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు, గోవిందు నరసింహారెడ్డి జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ టీమ్ సభ్యులు యోగి, వెంకటేష్, ఇనయతుల్లా, కళాశాల ప్రిన్సిపల్ చెన్నకేశవ ప్రసాద్, అధ్యాపకులు, ఎన్‌సీసీ, విద్యార్థులు పాల్గొన్నారు.

● **బుక్కపట్నం:** స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో కార్గిల్ వీరులకు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఇందులో ప్రిన్సిపల్ మగ్బుల్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఓబులేసు, అధ్యాపకులు శ్రీనివాసులు, రాజమహమ్మద్ పాల్గొన్నారు.

● **కొత్తచెరువు:** మండలంలోని లోచర్ల గ్రామంలో కార్గిల్ అమర వీరులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. ముందుగా విద్యార్థులు వంద మీటర్ల జాతీయ పతాకంతో ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● **ముదిగుబ్బ:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ముదిగుబ్బకు చెందిన మాజీ సైనికుడు షేక్ ఆలం అలీని శుక్రవారం ఎన్డీఏ కూటమి నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల దక్షిణ రాష్ట్రాల గౌరవ అధ్యక్షుడు వెంగమేష్ చౌదరి, బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, జనసేన మండల కన్వీనర్ జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి మంజుల, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ధర్మవరంలో కార్గిల్ ప్రాముఖ్యతను వివరిస్తున్న అధ్యాపకులు



తనకల్లులో నిర్వహిస్తున్న ర్యాలీ



బుక్కపట్నంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

29న పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

కదిరిఅర్బన్, జూలై 26: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం. నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులైన పాలిసెట్‌లో అర్హత లేకపోయినా స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు పది మార్కుల జాబితా, టీసీ, 4నుంచి 10వరకు స్టడీసర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, మూడుసెంట్లు జిరాక్స్ తీసుకుని హాజరుకావాలన్నారు. కళాశాలలో ఆటో మొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎల క్ట్రానిక్స్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లున్నారు. రూ.ఆరువేలు ఫీజులు తీసుకుని రావాలన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జూలై 26 : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేణు గోపాలచార్యులు, రమేశ్‌బాబు, కోశాధికారి నాగేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శైలజ, సీనియర్ జర్నలిస్టు మార్కెండేయులు ప్రారంభిస్తారన్నారు. గ్రామీణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అందని ఉపాధి బిల్లులు

నంబులపూలకుంట, జూలై 26: ఉపాధి పథకంలో పనిచేసిన కూలీలు బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు. ఎనిమిది వారాలుగా బిల్లులు అందలేదని కూలీలు వాపోతున్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని వాపోయారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం 520 మంది కూలీలు పనులు చేస్తున్నారని, అధికారులు స్పందించి తమకు రావాల్సిన బిల్లులు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గంగమ్మ ఆలయలో చోరీ

ఓబుళదేవరచెరువు, జూలై 26: మండలంలోని కుసుమవారిపల్లిలో గంగమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆలయ గేటు, తలుపుల తాళలను పగలకొట్టి ఆలయంలోకి వెళ్లిన దుండగులు హుండీల్లోని డబ్బు, బీరువాలోని అమ్మవారి పట్టుచీరలు, అమ్మవారి వెండి కళ్లను చోరీ చేసుకొని వెళ్లినట్లు తెలిపారు.

తంగభద్ర వరద కాలువ నిర్మించండి



మంత్రితో గోనుగుంట్ల భూషణ్

తాడిమర్రి, జూలై 26: తుంగభద్ర నదికి వరదకాలువను నిర్మించి రాయలసీమను కరువు కోరల నుంచి కాపాడాలని జనవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్టు ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ తెలిపారు. శుక్రవారం విజయవాడ సచివాలయంలో ఆయన్ను కలిసి సమస్యను విన్నవించినట్టు చెప్పారు. పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు బాబురాజేంద్ర ప్రసాద్‌తో కలిసి పూర్తి వివరాలను మంత్రికి అందించామన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న హెచ్ఎల్‌సీ కెనాల్‌కు సమాంతరంగా వరదకాలువ నిర్మిస్తే అనంతపురం, కడప, చిత్తూరు వరకు ఈ వరద నీరు గ్రావీటీ ద్వారా తరలించవచ్చని ఆయన పేర్కొన్నారు. హంద్రీనీవా ద్వారా పీఏబీ ఆర్, మిడ్‌పెన్నార్, చాగళ్లు, జీడిపల్లి, చిత్రావతి, గొల్లపల్లి, మారాల రిజర్వా యర్‌లకు హెచ్ఎల్‌సీ కెనాల్‌ను లింకప్ చేసి రాయలసీమ జిల్లాలను కాపాడాలని మంత్రిని కోరినట్టు తెలిపారు. మంత్రి ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.





ట్రాన్స్‌ఫార్మర్, ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

విద్యుత్ తీగలపై కొమ్మల తొలగింపు

ఓబుళదేవరచెరువు, జూలై 26: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అలాగే ఆంజనేయస్వామి ఆలయం వద్ద చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతున్నాయి. వర్షం వచ్చినప్పుడు విద్యుదాఘాతానికి ప్రాణ నష్టం జరిగే ప్రమాదముంది. దీనిపై ప్రమాదం పొంచి ఉన్నా... నిర్లక్ష్యం వీడరా అన్న కథనాన్ని శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ రామసూరారెడ్డి, శుక్రవారం సిబ్బంది అజయ్, రమేష్, సోముశేఖర్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను, చెట్లును తొలగించారు.

దశాబ్దాలుగా ఇంటిపట్టాల కోసం నిరీక్షణ



బాడుగకు నివాసముంటున్న రేకుల షెడ్లు



గత ప్రభుత్వం రద్దు చేసిన ఇళ్లస్థలాలు

ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే

తాడిమర్రి, జూలై 26: వారంతా ఇళ్లు లేని నిరుపేదలు. దాదాపు 32 సంవత్సరాల క్రితం గాలివీడు గ్రామం నుంచి 35 కుటుంబాల వారు వలస వచ్చి తాడిమర్రిలో స్థిరపడ్డారు. వారి జీవనాధారం కోసం పండ్ల మొక్కలు అమ్ముకునేందుకు గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఏటా పురుషులు వలసవెళ్తారు. ఇతర రాష్ట్రాల్లో చెట్లను అమ్మగా వచ్చిన లాభాన్ని తీసుకుని స్వగ్రామానికి వస్తుంటారు. మహిళలు మాత్రం ఇక్కడే ఉండి నర్సరీల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. మరికొంతమంది మహిళలు గాజుల వ్యాపారం చేస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ధర్మవరం నియోజకవర్గానికి ఐదుగురు ఎమ్మెల్యేలు మారారు. వచ్చిన వారంత తమకు ఓటు వేయండి.. పట్టా ఇస్తాం అంటారే కానీ ఏ ఒక్కరూ ఇవ్వలేదు. దీంతో ఆ కుటుంబాలు రేకుల షెడ్లలో బాడుగకు ఉంటున్నాయి. వీరు పూసలబలిజ సామాజిక వర్గానికి చెందిన వారు. ప్రస్తుతకూటమి ప్రభుత్వంలోనైనా తమకు ఇంటిపట్టాలు దక్కుతాయా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు ఉన్న టీడీపీ హయాంలో ఇంటిపట్టాలు పంపిణీ చేసేందుకు పలు మార్లు ప్రయత్నాలు జరిగినా... స్థానిక నాయకుల సమన్వయలోపం వల్ల ఇవ్వలేకపోయారు. ఒక చోట ఒకరు ఇవ్వాలని... మరోక చోట ఇవ్వాలని మరో వర్గం పట్టుపట్టడంతో అసలు వీరికి పట్టాలే అందకుండాపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో తాడిమర్రి నుంచి మరువపల్లికి వెళ్లే దారిలోని ప్రభుత్వ స్థలంలో 190 మందికి ఇంటి పట్టాలిచ్చారు. అయితే శ్మశానానికి అనుకుని ఉండటం.. వర్షాలు వస్తే ఆ నీరంత ఇళ్లలోకి చేరుతుందని ఎవరూ అక్కడ ఇళ్లు నిర్మించుకోవడానికి సాహసం చేయలేదు. దానిని సాకుగా చూపి వైసీపీ ప్రభుత్వం ఇంటి పట్టాలను రద్దుచేసింది.



కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలి

మూడు ప్రభుత్వాలను చూశాం. ఇప్పటి కూటమి ప్రభుత్వంలోనైనా మాకు పట్టాలు అందుతాయని ఆశపడు తున్నాం. మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మా సమస్యపై దృష్టిసారించి పట్టాలు ఇప్పించాలి.

బోశెట్టి గుంగలప్ప, తాడిమర్రి



బాడుగలు కట్టలేకున్నాం

32 సంవత్సరాల క్రితం తాడిమర్రికి వచ్చాం. మా ఆయన చెట్ల వ్యాపారానికి పోతే నేను గాజుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. రేకుల షెడ్‌లో అద్దెకు ఉంటున్నాం. నెలనెలా బాడుగలు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాం.

కుళ్లాయమ్మ, తాడిమర్రి

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ముదిగుబ్బ, జూలై 26: మండలంలోని మర్తాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని బత్తలపల్లి సీడీపీఓ సరస్వతి శుక్రవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఫుడ్ కమిషన్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు సీడీపీవో తెలిపారు.

వైభవంగా పీర్ల పండుగ

ధర్మవరం రూరల్, జూలై 26: మండలంలోని వసంతపురంలో శుక్రవారం పీర్లపండుగను వైభవంగా నిర్వహించారు. మకాన్‌లో ఏర్పాటు చేసిన పెద్దకాశీంస్వామి, చిన్నకాశీంస్వామి, మౌలాలిస్వామి, కుళ్లాయిస్వామి పీర్లకు ముల్లాసాబ్‌లు వలి, పెద్దమౌలసాబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున చక్కెరచదివింపులు, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అగ్నిగుండం ప్రవేశం చేశారు. సాయంత్రం గుండం పూడ్చివేసి పీర్లను ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు.

నల్లచెరువు : మండల కేంద్రంలో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బసవన్నకట్టవద్ద ఉన్న పీర్ల చావిడితో ఈ యేడాది యూత్ కమిటీగా ఏర్పడి అత్యంత వైభవంగా నిర్వహించింది. కరణం వీధి నుంచి బసవన్నకట్ట వరకు పీరాపూలతో మౌలాలిస్వామి ఊరేగించి, మకాన్ వద్ద ఉంచారు. అనంతరం భక్తులు మౌలాలీ స్వామిని దర్శించుకుంటారు. పీర్ల చావిడి వద్ద శుక్రవారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.



వసంతపురంలో జలధికి వెళ్తున్న పీర్లు



నల్లచెరువులో పీర్లకు అలంకరణ

వడ్డెర కమిటీ ఏర్పాటు

పుట్టపర్తి, జూలై 26: స్థానిక శిల్పారామంలో వడ్డెర్ల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించి నూతన జిల్లా కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడు ఉత్తన్న మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో వడ్డెర్లకు కమ్యూనిటీ భవనం, కళ్యాణమండపం, పేదవిద్యార్థుల హాస్టల్ వసతి గృహం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చక్రపాణి, నాయకులు మారెప్ప, శ్రీనివాసులు, గంగరాజు, రఘురాములు, గోగుల రామాంజినేయులు, ఇడగట్టు జయమ్మ పాల్గొన్నారు.

పులగంపల్లిలో కంటి వైద్య శిబిరం

నల్లమాడ, జూలై 26: మండలంలోని పులగంపల్లిలో ఆల్ట్రావిజన్ ఐకెర్ ఆసుపత్రి వైద్యులు బొగ్గు సురేష్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈవైద్యశిబిరం ఓబుళదేవరచెరువుకు చెందిన మామెడికల్స్ యజమాని సురేషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ శిబిరంలో ఓడీసీ, నల్లమాడ నుంచి 133 మందికి కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి పుట్టపర్తిలోని సత్యమ్మగుడి సమీపంలతోని అల్ట్రా విజన్ ఐకెర్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి మస్తాన్, వైద్యసిబ్బంది సుధాకర్, రాజేష్, నందిని, యాస్మిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నల్లమాడ, జూలై 26: మండలంలోని రామాపురం అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు రెడ్డిపల్లి వైద్యులు, సిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలికలకు రక్తపరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతాన్ని గుర్తించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు, వారానికి ఒకసారి ఐరన్, డీవార్మింగ్ మాత్రలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామాంజనేయులు, ఆరోగ్య విద్యాబోధకుడు రామచంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశాల తనిఖీ

తాడిమర్రి, జూలై 26: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను డ్వామా పీడీ విజయప్రసాద్, ఎంపీడీఓ మణిమంజరి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించి శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలకు నాణ్యమైన మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు హరిత, గోవర్ధన్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ కేంద్రాలు...

ఓబుళదేవరచెరువు: మండలంలోని ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను వైద్యులు జ్యోష్నా, డాక్టర్ సునీల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీల సర్టిఫికెట్లు పరిశీలించి, నివేదికలు తయారుచేసి, ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. వీరి వెంట వైద్య బృందం సభ్యులు కమల్‌రోహిత్, ఆరోగ్య విస్తరణాధికారి నగేష్, ఆరోగ్య విద్యాబోధకురాలు సుశీలమ్మ, ఆరోగ్య కార్యకర్త నాగవేణి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

జూదరుల అరెస్టు

తాడిమర్రి, జూలై 26: మండలంలోని పిన్నదరి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న పది మందిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగాస్వామి తెలిపారు. వారి నుంచి రూ.39,390 నగదు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి.. కోర్టులో హాజరుపరిచామన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

ముదిగుబ్బ : గ్రామాల్లోనే యువత పట్టణాలకు వలస వెళ్లకుండా మండల కేంద్రాల్లో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ దక్షిణ భారత రాష్ట్రాల గౌరవ అధ్యక్షుడు వెంగమేష్ చౌదరి కూటమి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించిన నేపథ్యంలో పాలకులు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు.

వేపరాలలో గ్రామసభ

గాండ్లపెంట: మండలంలోని వేపరాల సచివాలయంలో పారిశుధ్యంపై గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వసుంధరా మాట్లాడుతూ.. ప్రతి ఒకరు ఇంటి పరిసరాలను, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షపు, మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రియాజ్, అంజినాయక్, ఆదిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వార్డును పరిశీలిస్తున్న డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి

ఆసుపత్రిని తనిఖీ చేసిన స్పెషలాఫీసర్

గోరంట్ల, జూలై 26: మండలంలోని కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్పెషాలాఫీసర్, డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రోగులను పలకరించి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్‌రూంను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిధుల మంజూరు, మందుల సరఫరాపై వైద్యులు సాయిసుప్రీత, మాధవిలతో ఆయన చర్చించారు. మల్లెల గ్రామం, గౌని వారిపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. గోరంట్ల డపింగ్‌యార్డుకు వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టును తయారు చేయించాలని, కార్యదర్శి బాబురావును ఆదేశించారు. ఈఓఆర్‌డీ సుధాకర్, కార్యదర్శులు శంకర్, మస్తాన్, పంచాయతీ కార్మికులున్నారు.

రొళ్లలో..

రొళ్ల, జూలై 26: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం డివిజినల్ పంచాయతీరాజ్ అధికారి శివసూర్యనారాయణరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం హొట్టేబెట్టలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో సేవలపై రోగులతో ఆరా తీశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, డాక్టర్ సుజన, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గోరంట్ల, జూలై 26: మండలంలోని మల్లాపల్లిలో డాక్టర్ శ్రుతి ఆధ్వర్యంలోని వైద్యబృందం పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తుండడంతో దోమల వలన మలేరియా, డెంగీ లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పరిశుభ్రత పాటించాలని ప్రజలకు వారు అవగాహన కల్పించారు. మురికివాడలు, కాల్వల వద్ద దోమలార్వాలు ప్రబలకుండా మందు ద్రావణం, బ్లీచింగ్ పౌడరును చల్లించారు. తాగునీటి బోరు, నీటి ట్యాంక్‌లను పరిశీలించి, డయేరియా, వాంతులు, విరేచనాలు రాకుండా తాగునీటిని వడబోసి, కాచి చల్లార్చి తాగాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రమణ, సర్పంచ్ శివానంద, సూపర్‌వైజర్ రసూల్, వైద్య సిబ్బంది శైలజా, ప్రత్యూష, ఆశాలు లీలావతి, శకుంత, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

అగళి, జూలై 26: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లను శుక్రవారం సత్యసాయి జిల్లా ఇన్‌చార్జి పీడీ నాగమల్లీశ్వరి ఆకస్మిక తనిఖీ చేశారు. అగళి-2, తునసనపల్లి, కదిరేపల్లి, మధుడి, గొల్లహట్టి గ్రామాల్లోని కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. సూపర్‌వైజర్ లీలావతి, కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ పీడీ నాగమల్లీశ్వరి

వక్క మార్కెట్ నిర్మాణానికి సహకరించండి

● మల్బరీ రైతులకు ప్రోత్సాహం పెంచాలి: మంత్రులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల వినతి

మడకశిర, జూలై 26: వక్క మార్కెట్ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కోరారు. వెలగపూడిలోని రాష్ట్రసచివాలయంలో హోంమంత్రి అనిత, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును శుక్రవారం వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మడకశిర అర్బన్ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐ పోస్ట్ ను, మడకశిర నియోజకర్గంలో ని ఐదు మండలాల పోలీస్ స్టేషన్‌ల్లో సిబ్బంది తక్కువగా ఉన్నారని, వాహనాలు లేవని హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు ను కలసి నియోజకవర్గంలోని అమరాపురం లో వక్కమార్కెట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు పొందిన పట్టు రైతులకు రాయితీలు, ప్రోత్సాకాలను గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఇచ్చారని, మరలా వాటిని కొనసాగించాలని కోరారు. ఎంపీఈఓలను అంతర్ జిల్లా బదిలీల నుంచి తప్పించాలని కోరారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో అమరాపురం కేంద్రంగా వక్క మార్కెట్ నిర్మాణానికి జీఓ.ఆర్టీ, నంబరు. 301 మంజూరు చేస్తూ రూ.3.66 కోట్ల నిధుల్ని అప్పట్లో నే కేటాయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన మార్కెట్ పనులు ప్రారంభానికి కూడా నోచుకోలేదన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో వక్కమార్కెట్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మల్బరీ రైతులను కూడా గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసిందని, వారిని ప్రోత్సహించాలని కోరారు. మల్బరీ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందజేసే సబ్సిడీని పెంచాలని కోరారు. రైతుకు రూ.50 చొప్పున ప్రోత్సాహక నగదును అందించాలని, సబ్సిడీతో రైతులకు ఉపకరణాలను అందించి ఆదుకోవాలని వారు మంత్రిని కోరారు.


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

బెదిరించడం వైసీపీకే చెల్లు

మండల సమావేశాన్ని అడ్డుకోవాల్సిన అవసరం లేదు: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూలై 26: ప్రజలను బెదిరించడం, దాడులు చేయడం వైసీపీకే చెల్లుతుందని చిలమత్తూరు మండలం టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు అన్నారు. శుక్రవారం కొడికొండ చెక్‌పోస్టులో నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం చిలమత్తూరు మండల సర్వసభ్య సమావేశాన్ని టీడీపీ నాయకులు అడ్డుకున్నారని, ముఖ్యంగా టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుపై చిలమత్తూరు వైసీపీకి చెందిన పురుషోత్తంరెడ్డి ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ దాడులు, బెదిరింపులు ఎలా ఉన్నాయో అందరికీ తెలిసిందేనన్నారు. పోలింగ్ రోజు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అనుచరులను వెంటబెట్టుకుని పోలింగ్ బూత్‌లో వీరంగం సృష్టించారు. టీడీపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, శనివారం జరిగే మండల సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకుంటామని వైసీపీ నాయకులు చెప్పడం హేయమైన చర్య అన్నారు. ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చామే తప్ప మిమ్మల్ని అడ్డుకోవడానికి కాదన్నారు. అయితే జిల్లా ఉన్నతాధికారులకు లేనిపోని ఫిర్యాదులు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేమకేతేపల్లి అంజినప్ప, నందీశ్, బాలాజీ, గౌరీశంకర్, నాగరాజు, సోమశేఖర్, అశ్వర్థప్ప, తిప్పారెడ్డి, బేకరి గంగాధర్, లక్ష్మీనరసప్ప, నాగరాజు, చౌడప్ప పాల్గొన్నారు.

రెండు నెలల్లో ఆసుపత్రిలో అన్ని సేవలు అందుబాటులోకి..

● పురం ఆసుపత్రిని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ అపూర్వ భరత్


ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

హిందూపురం అర్బన్ జూలై 26: ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదల ఆసుపత్రి. అలాంటి ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అన్ని రకాల వైద్య సేవలు 2 నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి కలెక్టర్ చైర్మెన్‌గా ఉన్నారన్నారు. అయితే ఆసుపత్రి డెవలప్‌మెంట్ కోసం రెండు నెలల వరకు కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు పెనుకొండ సబ్ కలెక్టర్ చైర్మన్‌గా, డీసీహెచ్ఎస్ కన్వీనర్‌గా, జిల్లా ఆడిట్ అధికారి, జిల్లా కో ఆర్డినేటర్, డా. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ వారు మెంబర్‌లుగా ఉంటారన్నారు. రోగులకు ఎటువంటి సేవలు అందుతున్నాయి. మందుల కొరత, వైద్య పరికరాల పనితీరు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు. ఇకపై వారానికోసారి ఆస్పత్రిని తనిఖీ చేస్తామన్నారు. ఆయన వెంట డీసీహెచ్ తిప్పేంద్రనాయక్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రోహిల్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: ఎస్పీ

హిందూపురం, జూలై 26: రానున్న వినాయకచవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రత్న పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురంలోని కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసే సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విగ్రహాల ఎత్తు గత యేడాదికంటే తక్కువగా ఉంటేనే బాగుంటుందని, ఎత్తు పెంచితే నిమజ్జనం రోజున విద్యుత్ వైర్లతో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలని, రాత్రి 12లోపు నిమజ్జనం పూర్తయ్యేలా సహకరించాలన్నారు. అధికారుల సూచనలు పాటించాలన్నారు. మండపాల వద్ద పూజలు చేసే రోజుల్లో నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా కొంతమంది విగ్రహ నిర్వాహకులు కొన్ని సూచనలు, సలహాలు తెలిపారు. డీఎస్పీకంజక్షన్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణవేణి, సీఐలు శ్రీనివాసులు, ఈరన్న, సిబ్బందితోపాటు, టీడీపీ నాయకులు డీఈ రమేష్, మంగేష్, సతీష్, అమర్నాథ్, నవీన్, మోదాశివ, ప్రవీణ్‌కుమార్, బాచి, బీజేపీ ఆదర్శ్, రవితేజారెడ్డి, తదితరులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన దర్యాప్తు చేపట్టి పరిష్కరించాలని ఎస్పీ రత్న సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రాత్రి హిందూపురం వన్‌టౌన్, అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలు, లాకప్ గదులు, రిసెప్షన్ గదులు, పరిశీలించారు. సిబ్బంది విధులపై ఆరాతీశారు. పాత కేసుల రికార్డులను పరిశీలించారు. గంజాయి, పేకాట, కర్నాటక మద్యం, నాటుసారా, మట్కాపై దృష్టిసారించాలన్నారు. సరిహద్దులో తరచూ తనిఖీలు చేస్తూ నిరంతరం నిఘా ఉంచాలన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

హిందూపురం(పరిగి), జూలై 26: మండలంలోని కొడిగెనహళ్లి గ్రామ శివారు నీటి కుంటలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమయ్యింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు హిందూపురం సమీపంలోని జయమంగళి నది తీరంలో ఇసుకను తరలించడానికి ఉపయోగించిన నీటి గుంతలో అనుమానాస్పదంగా ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండురోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి వయసు 35ఏళ్లు, ఛామనచాయరంగు, పచ్చరంగు స్వెట్టర్, చిలకపచ్చ లంగా దరించి ఉందన్నారు. ఆనవాళ్లు గుర్తించిన వారు పరిగి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల తరలింపుపై కేసు నమోదు

గోరంట్ల, జూలై 26: తమిళనాడులోని కబేళాలకు 30 లేగదూడలు, పశువులను తరలిస్తున్న ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు శుక్రవారం తెలిపారు. గోరంట్ల పశువుల సంతనుంచి నాలుగు గూడ్సు వాహనాల్లో 16పశువులు, 35 లేగ దూడలు తరలిస్తుండగా కొండాపురం క్రాస్ వద్దజనసేన, బీజేపీ నాయకులు పట్టుకుని గురువారం పోలీసులకు తెలిసిన సంగతి తెలిసిందే. ఇందులో రెండు వాహనాలు మనరాష్ట్రానికి చెందినవికాగా, రైతులతో విచారించి పోలీసులు వదిలిపెట్టారు. తమిళనాడుకు చెందిన టీఎన్ 23 డివై 6034, టీఎన్ 23 డీవై 2455 నెంబర్‌గల బొలరో వాహనాల, నిర్వాహకులు ఖాదర్, సుకుమార్‌లపై కేసు నమోదు చేశారు.

మారెమ్మ ఆలయంలో చోరీ

పెనుకొండ రూరల్, జూలై 26: పెనుకొండ మండలంలోని వెంకటాపురం తండా రబ్బర్ ఫ్యాక్టరీ ఎదురుగా మారెమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించి హుండీ పగలకొట్టి అందులోని నగదు, అమ్మవారి మెడలో ఉన్న 40గ్రాముల వెండి నగలు అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం యథావిధిగా పూజారి గుడి తలుపులు తెరవడానికి ప్రయత్నించగా అప్పటికే తాళాలు పగిలి ఉండటం, అమ్మవారి నగలుచోరీ గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రాజేష్, సిబ్బంది పరిశీలించారు. చోరీ విషయంపై ఆరా తీసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


పగలగొట్టిన హుండీని పరిశీలిస్తున్న గ్రామస్థులు

ఎస్‌బీఐ సేవాకేంద్రంలో..



షెట్టర్ తొలగించిన దొంగలు

హిందూపురం, జూలై 26 : పట్టణంలోని లేపాక్షి ప్రధాన రహదారిలో నానెప్పనగర్‌వద్ద ఉన్న ఉన్న ఎస్‌బీఐ ఖతాదారుల సేవాకేంద్రంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. అర్ధరాత్రి దాటాక దుండగులు షెట్టర్‌ను గునపంతో తొలగించి డ్రాలో ఉన్న రూ.96వేలు నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం సేవా కేంద్రం యజమాని రమేష్‌బాబు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న షెట్టర్ తొలగించి చోరీ చేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఉచిత మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

పెనుకొండ, జూలై 26 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 28న ఆదివారం పెనుకొండలో ఉచిత మూర్ఛవ్యాధి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జోన్ అధ్యక్ష కార్యదర్శులు నబీ, ఇమ్రాన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఘనగిరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉదయం 9.30గంటలకు శిబిరాన్ని ప్రారంభిస్తామన్నారు. శిబిరంలో బెంగళూరుకు చెందిన అక్షయ న్యూరో, మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఫిజిషియన్ డా. నీలైఖ్య, వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మార్కుల జాబితాలు తీసుకెళ్లండి

పెనుకొండ, జూలై 26: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023-24కు సంబంధించి విద్యార్థుల ఒరిజినల్ మార్క్సుమెమోలు వచ్చాయి. మార్చి, సప్లిమెంటరీకి చెందినవి కళాశాలకు వచ్చాయని, విద్యార్థులు కళాశాలలో తీసుకోవాలని, ప్రిన్సిపాల్ సుదర్శన్ ప్రకటించారు.

మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

హిందూపురం అర్బన్, జూలై 26: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో, అంబేడ్కర్ గురుకులాల్లో 2024- 25 సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఆర్ట్స్ గ్రూప్‌లో మిగిలిన సీట్లు భర్తీకి స్పాట్ అడ్మిషన్‌లు జరుగనున్నట్లు గురుకులాల సమన్వయ అధికారి మురళికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీలో 2023- 24 సంవత్సరంలో 360 మార్కులు పైన సాధించిన బాలికలు ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా కింద తెలిపిన కళాశాలల్లో ఆర్ట్స్ గ్రూప్‌లో నేరుగా అప్లికేషన్ అందించి సీటు పొందవచ్చన్నారు. ఉరవకొండ (బాలికలు) సీఈసీ-2, ఎంఈసీ-30, బ్రహ్మసముద్రం (బాలికలు) సీఈసీ-8, హెచ్ఈసీ-10, నల్లమాడ(బాలికలు) సీఈసీ- 6, హెచ్ఈసీ- 35 ఖాళీలు ఉన్నాయి.

జవాన్లకు సన్మానం

హిందూపురం అర్బన్‌జూలై 26: విద్యార్థులు చదువుకునే స్థాయి నుంచే వారిలో దేశ సేవపట్ల. సమాజ సేవపట్ల గౌరవం పెంపొందేలా తీర్చిదిద్దాలని భాష్యం జోనల్ ఇన్‌చార్జ్ రవివర్మ పేర్కొన్నాడు. శుక్రవారం కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని ఇండియన్ ఆర్మీలో పని చేస్తున్న ఉపేంద్ర, రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ కార్గిల్‌ను ఆక్రమించాలని ప్రయత్నించినపుడు త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడి పాకిస్తాన్ ఆర్మీని తిప్పికొట్టారని విద్యార్థులకు తెలిపారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.. కార్యక్రమంలో కోఆర్డినేటర్ భార్గవి, ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.


సైనికులను సన్మానిస్తున్న స్థానికులు

హిందూపురం(పరిగి): కార్గిల్‌లో వీరమరణం పొందిన సైనికులను స్మరించుకుంటూ కార్గిల్‌దివస్ నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి భగత్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవామందిరం కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, అరుణ్‌కుమార్, కార్తీక్, ప్రసన్న, సంతోష్ పాల్గొన్నారు.

అందుబాటులో రాగి విత్తనాలు

అగళి, జూలై 26 : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతులకు మేలైన, నాణ్యమైన రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి శేఖర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బస్తా 4కేజీల పూర్తి ధర రూ.145ఉంటే రైతులు 50శాతం సబ్సిడీతో రూ.73చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు. ఇరిగేపల్లి, హల్లికెర రైతు కేంద్రాల్లో 1క్వింటాల్, మిగిలిన అన్ని రైతుసేవా కేంద్రాలలో 2క్వింటాళ్ల చొప్పున రాగి విత్తనాలున్నాయని ఆయన రైతులకు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన చందన

మడకశిర రూరల్, జూలై 26: రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీల్లో మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చందన ప్రతిభ కనబరచి, విజేతగా నిలిచారని పీఈటీ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో చందన శ్రీసత్యసాయి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. జట్టును తృతీయస్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించింది. విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



శాకంబరిగా అమ్మవారి దర్శనం


శాకంబరి అలంకరణలో వాసవీమాత

హిందూపురం అర్బన్, జూలై 26: ఆషాడ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు శోభాయామానంగా తయారయ్యాయి. పట్టణ పరిధిలోని ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాతను కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. ముద్దిరెడ్డిపల్లిలోని తొగటవీర క్షత్రీయుల ఆరాధ్యదైవం చౌడేశ్వరీమాతను, నింకంపల్లి రోడ్డులోని యల్లమ్మ ను శాకంబరీగా అలంకరించి పూజలు నిర్వహించారు.


చౌడేశ్వరీ అమ్మవారు

ప్రకృతి వ్యవసాయ కేంద్రాల పరిశీలన

అగళి, జూలై 26 : మడకశిర పరిధిలోని అగళి, అమరాపురం, శిర మండలాల్లో ప్రకృతి వ్యవసాయ కేంద్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు డీపీఎం లక్ష్మానాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం లాభాలను వివరించారు. రైతులకు మేలు చేయడానికే ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ శేఖర్‌నాయక్, పవన్, రమేష్, రవీంద్రకుమార్, లక్ష్మీకాంత్, చెంపరాజు, మాలేగౌడ్, దుర్గమ్మ, ఉమాదేవి, సౌమ్య, కావ్య, నాగమణి, అనిత, భవ్య, ఆదేవిధంగా మోడల్ ఏగ్రేడ్, మోడల్ డి ఆర్చియం, మోడల్ పీఎండిఎస్ మోడల్ పరిశీలించారు. తగు సలహాలు, సూచనలు అందజేశారు.


అవగాహన కల్పిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

కత్తెర పురుగును అరికట్టాలి

చిలమత్తూరు, జూలై 26: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, సకాలంలో పురుగు నివారణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు రైతులకు సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని కోడూరు గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న సాగుచేసి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మొక్కజొన్నలో ప్రధానంగా కత్తెర పురుగు సమస్య ఉందని, దాని నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు హిందూపురం ఏడిఏ అల్తాఫ్ అలీఖాన్, మండల వ్యవసాయాధికారులు వంశీకృష్ణ, శ్రీవిద్య, ఏఈఓ శైలజ, లోకేష్, రైతులు పాల్గొన్నారు.

దిన్నెహట్టికి అధికారుల పరుగు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుడిబండ, జూలై 26 : మండలంలోని దిన్నెహట్టి గ్రామానికి ఏఓ నారాయణప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, ఈఓఆర్డీ నాగరాజునాయక్, ఆరోగ్య వైద్య సిబ్బందితో కలిసి శుక్రవారం దిన్నేహ ట్టి గ్రామంలో పర్యటించారు. దిన్నేహట్టిలో వాంతులు విరేచనాలు అనే పేరుతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈగలు దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అదేవిధంగా గ్రామంలో ఎంతమందికి వాంతులు, విరేచనాలు అయ్యాయనే ఆరాతీసి తక్షణం చికిత్స అందేలా చూశారు. పంచాయతీ కార్యదర్శి అమరేష్, ఆరోగ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై కియ ప్రత్యేక దృష్టి

పెనుకొండ రూరల్, జూలై 26: గ్రామీణ ప్రాంత ప్రజలను మెరుగుపరిచే దిశగా కియ ఇండియా పనిచేస్తుందని కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్‌డాంగ్లీపేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని గుట్టూరులో ప్రాథమిక వైద్యశాలలో ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీలో కియ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ఐకేర్ ఆన్‌వీల్స్ మొబైల్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. గుట్టూరులో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాల, శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో సోలార్ వీధిలైట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కబ్‌డాంగ్లి మాట్లాడుతూ పెనుకొండ మండలంలో ఏడు గ్రామాల్లో 250సోలార్ సౌరశక్తితో నడిచే వీధిదీపాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నమ్మ, కియ పీఆర్‌ఓ తేజశ్విని, సీమరంజయ్ పాల్గొన్నారు.


ఐకేర్ వాహనాన్ని ప్రారంభించిన కియ ప్రతినిధులు

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 26: మండల అభివృద్ధి పనులపై వాడివేడిగా సాగాల్సిన సర్వసభ్య సమావేశం శుక్రవారం నామమాత్రంగా ముగిసింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీపీలు గంగాదేవి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. పలు శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజాప్రతినిధులు ఒకరిద్దరు మినహా ఎవరూ సమస్యల గురించి ప్రస్తావించలేదు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పదే పదే సమస్యల గురించి ప్రశ్నించాల్సి వచ్చింది. నాగినాయనిచెరువు తండా సర్పంచ్ అంజేనాయక్ తమ గ్రామంలో స్కూల్ మూతబడిందని, అంగనవాడీ సెంటర్ లేదని, ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదన్నారు. కోఆప్షన్ మెంబర్ రఫీక్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాలనీలో పలు గృహాలకు విద్యుత్ సర్వీసులను అందించారన్నారు. పశుసంవర్థకశాఖ వైద్యులు బాలాజీ మాట్లాడుతూ అవసరమైన వారు పశువులకు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. గడ్డి పెంపకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పశువులు, గొర్రెలు, కోళ్ల ఫారాల కోసం సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమందేపల్లి ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య మాట్లాడుతూ హిందూ శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయాలని తహసీల్దార్ అంజనాదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులుపాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం


ధ్రువపత్రాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పెనుకొండ రూరల్, జూలై 26 : టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరచిన దివ్యాంగులను ప్రోత్సహించడమే ధ్యేయమని సంస్థ అధినేత మేరివటవట్టం పేర్కొన్నారు. శుక్రవారం రొద్దం మండలంలో దివ్యాంగుల పరస్పర సహాయ సంఘం పొదుపు సంఘం ఆధ్వర్యంలో 16వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెనుకొండ, రొద్దం, రామగిరి, సోమందేపల్లి మండలాల నుంచి 4వేల మంది దివ్యాంగులు పాల్గొన్నారు. సమావేశంలో మేరి వటవట్టం మాట్లాడుతూ నాలుగు మండలాల్లో 130సంఘాలతో 1580మంది సభ్యులతో సంస్థ పనిచేస్తుందన్నారు. దివ్యాంగులు జీవనోపాధిలో భాగంగా ఎనిమిది రకాల సబ్బులు, ఆవకాయ, కొవ్వొత్తుల తయారీ లాంటివి చేస్తున్నారన్నారు. గ్రామసిరి అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, ప్రోగ్రామ్ మేనేజర్ జయశ్రీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్ల రిలీవ్

అనంతపురం టౌన్, జూలై 26: ఎన్నికల సమయంలో నిబంధనలకు లోబడి ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లు అనంత జిల్లాకు బదిలీపై వచ్చారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో తిరిగి వారందరినీ వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ వారం రోజుల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తుపాన్ ప్రభావం నేపథ్యంలో వారిని రిలీవ్ చేయవద్దని ఆదేశాలు రావడంతో ఆగిపోయాయి. ఇతర జిల్లాల నుంచి అనంత జిల్లాకు వచ్చిన 39మంది తహసీల్దార్లను కలెక్టరు వినోద్‌కుమార్ రిలీవ్ చేశారు.